'ఛీ! ఛీ! నువ్వింత నీచుడివనుకోలేదు రఘూ. ఇప్పుడు నా జీవితం ఏంకావాలి?'

"నీ జీవితం ఏంకావాలో చెప్పడానికి నేను జ్యోతిష్కుడ్ని కాను. ఈ విషయంలో నేను ఇంతకన్నా చెయ్యగలిగింది ఏంలేదు."

"అంటే?"

"నాకు తెలిసిన డాక్టర్ దగ్గరికి తీసుకెళ్ళి అబార్షన్ చేయిస్తా."

"ఛీ. ఆ మాట అనడానికి సిగ్గులేదూ?అడ్డం అయిన తిరుగుళ్ళూ తిరిగి అబార్షన్లు చేయించుకొనే బజారుదాన్ని అనుకొన్నావా?"

రఘు ఏం మాట్లాడలేదు. రాధకి అతన్ని చూస్తుంటే దహించుకుపోతున్నది. నమ్మింది. ప్రేమించి అనుభవించి ఆఖరికి తను ఇప్పుడు ఏంచెయ్యలేనని అతను అంటుంటే ఆడదిగా భరించలేకపోతున్నది. ఆమెలో అహం అభిమానం దెబ్బతిని బుసలుకొడ్తున్నాయి.

ఐదునిమిషాలు నిశ్శబ్దంగా గడిచింది. రాధ దీనంగా ఏడుస్తున్నది. "రఘూ! నిన్నే నా సర్వస్వంగా భావించి నన్ను నేను అర్పించుకున్నా. నాకు ఏం తక్కువ అయిందని ఇప్పుడు కాదు పొమ్మంటున్నావో చెప్పు. నువ్వు ఊఁ అంటే నాన్నగారితో చెప్పి నీకు ఏంకావాలన్నా ఇప్పిస్తాను. డబ్బు కావాలా? మేడలు కావాలా? ఏంకావాలి ?"

"నాకు ఏం అక్కర్లేదు" రాధ భోరని అతని గుండెలమీద పడి, "అలా అనకు రఘూ!

నువ్వు లేకుండా నేను బతకలేను.ఆ ఒక్కమాట దయచేసి అనకు."

"క్షమించు రాధా! ఇది నేను ఎంతో ఆలోచించి తీసుకున్న నిర్ణయం. దీన్ని మార్చాలని నువ్వు చేసే ప్రయత్నం అంతా వృధా."

రాధ కన్నీటి తడిమధ్య తల యెత్తింది. "పోనీ ఈ నిర్ణయం ఎందుకు తీసుకున్నావో చెప్పు" అతని గుండెలమీద చొక్కా పట్టుకుని కుదుపుతూ అడిగింది. కానీ అతను ఏం మాట్లాడ లేదు.

అతని ముఖం నిర్లిప్తంగా ప్రశాంతంగా ఉంది. కనీసం ఏ విధంఅయిన సంఘర్షణగానీ బాధగానీ రాధకి కనబడలేదు. అతన్ని యెలా అర్థంచేసుకోవాలో తెలీడంలేదు.

"సరే, ఇంక నేను వస్తా రాధా" రఘు లేచాడు. పార్కులో పదినిమిషాలు కూర్చుని తర్వాత ప్యాంటు దులుపుకుని వెళ్ళిపోయే మనిషి మాదిరిగా తన జీవితంలో ఆడిపాడి ఎగిరిగంతి మాటలు చెప్పి అన్నిపనులూ చేసేసి చివరికి ఏం ఎరగనట్లే లేచి వెళ్ళిపోబోతున్న అతనిలో యుగయుగాలుగా మగజాతి ఆడదాని పట్ల ప్రవర్తించే నీచత్వం అవకాశపరత్వం రాధకి కనిపించాయి. ఆ క్షణంలో ఆమెకి మగ జాతి మొత్తాన్ని కత్తికి ఒక ముక్కగా నరికి పారేయ్యాలనే రాక్షసత్వం పొంగి పొర్లింది.

కానీ రాధ ఆడది కేవలం సగటు ఆడది! ఏం చెయ్యగలదు? కన్నీళ్ళు ఒత్తుకొంటూ తల వంచుకుని వెళ్ళిపోవడం తప్ప?.

వెళ్ళిపోతున్న రాధని క్షణంసేపు చూసి రఘు సిగరెట్ అంటించుకుని లేచాడు.

⁂ ⁂ ⁂

సుధీర్ పక్కకితిరిగి పడుకున్నాడు. రాధకి ఇంకా నిద్రరావడంలేదు. కిటికీలోనుంచి వెన్నెల ఒయ్యారంగా పక్కమీద పడ్తున్నది. చల్లటి గాలి పసిపిల్లాడి మాదిరిగా అల్లరిచేస్తున్నది.

రాధకి యింకా డాక్టర్ సుమతి మాటలు గుర్తువస్తున్నాయి. ఆక్షణంలో సుధీర్ ఆనందం చెప్పడానికి వీల్లేదు. తను తల్లికాబోతున్నట్లు డాక్టర్ చెప్తున్నప్పుడు సుధీర్ మొహం యావత్ ప్రపంచాన్ని జయించిన చక్రవర్తిలా వెలిగిపోయింది. అప్పుడు అతను తననిచూసిన చూపుకి సిగ్గుతో ఒణికిపోయింది. తనలో తెలిని ఏవో భాగాల్ని ఆ చూపు ఒక్కసారి స్పృశించి నట్లు అయింది. ఆదమరచి నిద్రపోతున్న సుధీర్‌లో పసివల్లాడు ఆమెకి కనిపించాడు. అతని చెరిగిన క్రాఫ్‌ను వేలిగోళ్ళతో సవరించి తలను గుండెలమధ్య పొందికగా ఉంచుకొంది.

ఇంక తనకి జీవితమే లేదనుకుంటున్న సమయంలో అకస్మాత్తుగా సుధీర్ కలిసి మళ్ళీ జీవితం ప్రసాదించాడు. అతనే కలవకపోతే ఈపాటికి తన ప్రాణం అనంతవాయువుల్లోనో పంచభూతాల్లోనో లేదా మరే మాతృగర్భంలోనో ఉండేది గాబోలు. మానవుల్లో దేముళ్ళు ఉంటా రనడానికి యింతకి మించిన నిదర్శనం యేం కావాలి? తనకి కావలసినంత సిరిసంపదలు ఉండ వచ్చు. తండ్రికి ఈదేశంలో ఏంఅయినా చెయ్య గల స్తోమత ఉండవచ్చు. కానీ ఆనాడు తను వున్న స్థితిలో తనకిమాత్రం ఏం చెయ్యలేడు. ఎంత డబ్బున్నా అదిగూడా చెయ్యలేని పనులు వుంటాయని ఆనాడే తెలిసింది.

సుధీర్ చేతివేళ్ళు తన గుండెల ఎత్తుపల్లాల మీద ఆడుకొంటూ వుండటం గమనించి అతను యింకా నిద్రపోవడంలేదని అర్థంచేసుకుంది.

"ఏమిటి ఆలోచిస్తున్నావ్?"

"బయట వెన్నెల చూస్తుంటే అందులో మీ మనస్సు కనిపిస్తున్నది. అందుకని "

"ఏమిటి మళ్ళీ ఈ పొగడ్త? రేపు ఏదన్నా ఇన్‌డెన్టు పెడ్తున్నావా?" సుధీర్ నవ్వుతూ.

"ఛీ! మీరు మరీను. ఈ భూమిమీద మీ రూపంలో దొరికిన ఇన్‌డెన్టు తన్నా నాకు యింకేం కావాలి?"

"సరేగానీ, గర్భిణీస్త్రీలు ఎక్కువగా ఆలోచించకూడదు, పొగడకూడదు, ఇలా అర్థరాత్రి దాకా ఆలోచించకూడదూ అని డాక్టర్ చెప్పింది గుర్తుందా?"

రాధకి సిగ్గు కోపం ముంచుకువచ్చి సుధీర్‌ని వీపుమీద ప్రేమగా కొట్టింది. "మాట్లాడితే మీరు నన్ను గర్భిణీస్త్రీ అంటే నాకు మహా కోపం వస్తుంది తెలుసా?"

"ఈ ఆడవాళ్ళతో నిజాలదగ్గర యెప్పుడూ తగాదానే। గర్భిణీస్త్రీని గర్భిణీస్త్రీ అనక మరేం అంటారు?"

"ఏం అక్కర్లేదుగానీ మీరింక పడుకోండి"

సుధీర్ రాధ మెత్తదనాల్ని మత్తుగా చూస్తూ మరింత దగ్గరికి తీసుకున్నాడు. రాధ తట్టుకోలేని తన్మయత్వంలో ద్రవీభవిస్తున్న మంచు గడ్డలా అతని భుజాల వెచ్చదనంలో అతుక్కుపోయింది.

ర ర ర

"యాభై ఆరేళ్ళ జీవితంలో ఏనాడూ ఎవర్నీ దేహీ అని అర్థించలేదు బాబూ. నీకాళ్ళు పట్టుకుంటా, రాధ జీవితం అన్యాయంచెయ్యకు"

"ఇందులో నేను అన్యాయం చెయ్యడం అనే ప్రసక్తి అసలు లేనేలేదు. అన్యాయం జరిగింది నాకు. అలాంటిది నేను నోరు మూసుకుంటే, మీకు అన్యాయం చెయ్యద్దంటారేమిటి?"

"రాధ ఇందులో కావాలని ఏంచెయ్యలేదు. ఆనాడు ఎవరో నయవంచకుడు మంచిదనంతో చేసిన వంచనకి అమాయకంగా బలి అయింది. అంతకన్నా ఏంలేదు. అయినా నువ్వు రాధతో ఐదేళ్ళుగా కాపరంచేశావ్. ఏనాడు అయినా ఏ విధం అయిన పొరపాటుగానీ చూశావా?"

"నేను మాట్లాడుతున్నది నా ముందు ఐదేళ్ళ పాటు రక్తి కట్టించే విధంగా ఆడిన నాటకం గురించి కాదు. అంతకుముందు సంగతి. రఘుతో రాధకి అక్రమ సంబంధం వుందా లేదా? అది కొన్నేళ్ళు జరిగిందా లేదా? అతని సంపర్కంతో రాధకివచ్చిన కడుపుని ఎబార్షన్ చేయించారా లేదా? వాళ్ళిద్దరూ రాసుకున్న ఉత్తరాలు అబద్ధమా? ఆ ఫోటోలు అబద్ధమా? రాధకి అబార్షన్ చేసిన డాక్టర్ చెప్పిన మాటలు అబద్ధమా? ఏది అబద్ధం? ఇందులో ఏది అబద్ధం అని నన్ను మీరు ప్రశ్నించడానికి వచ్చారు?"

"నిన్ను ప్రశ్నించడానికి రాలేదు బాబూ, అర్థించడానికి వచ్చాను. దేశంలో ఒక ప్రముఖ వ్యక్తి బాధ్యతాయుతం అయిన ప్రజా ప్రతినిధిగా నాకువున్న పరువు ప్రతిష్ఠలు సంఘంలో గౌరవం ఈ నాడు నీ చేతుల్లో వున్నాయి."

సుబ్బారెడ్డి యెంత ఆపుకోవాలని ప్రయత్నిస్తున్నా ఏడుపు ఆగడం లేదు. జీవితంలో ఎప్పుడూ ఎదుటివారి బాధల్ని కష్టాల్ని కన్నీరుని చూసి పైకి సానుభూతి నటిస్తూ లోపల ఆనందించే సుబ్బారెడ్డి ఈనాడు నిజంగా ఏడుస్తున్నాడు.

సెంటు వాసనల ఖరీదయిన ఖద్దరు సిల్కు లాల్చీ గ్లాస్కో ధోవతిలో ఆరడుగుల సుబ్బారెడ్డిని ఆ క్షణంలో ఎవరు చూసినా ఆశ్చర్యపోక తప్పదు. ఎందుకంటే రాజకీయ రంగంలో ఆయన అపరచాణక్యుడు జీవితంలో మహోగ్ర సింహం. అసెంబ్లీలో వెయ్యి ఎలిగేషన్లు వచ్చినా రాజకీయ జీవితంలో ఎంతటి కల్లోలం వీచినా వీసం యెత్తు తొణకని సుబ్బారెడ్డి ఆ క్షణంలో పసిపిల్లాడిలా మరో క్షణంలో ఉరికంబం ఎక్కుతున్న నేరస్థుడిలా దీనంగా పరమ దారుణంగా నిలబడి సుధీర్‌ని చూస్తున్నాడు.

ముఖం మీద చెమట తుడుచుకొని సుబ్బారెడ్డి మళ్ళీ అన్నాడు. 'ఈ రోజున నీ భార్య అవినీతి పరురాలని కోర్టులో దావావేసి విడాకులు తీసుకొన్నంతలో నీకు చేకూరే లాభం గూడా ఏం లేదు అల్లాడూ. రాధమీద కసి తీర్చుకోడం ఒక్కటే నువ్వు చూస్తున్నావు గానీ రేపు నీ కొడుకు భవిష్యత్ ఆలోచించావా? రేపట్నించి వాడికి తండ్రి ఎవరు? లోకానికి తన తండ్రి యెవరని ఆ పిల్లాడు చెప్పుకోవాలి? రేపు నీ కొడుకుని నలుగురూ వేలెత్తిచూపించి అవమానిస్తే ఆ అవమానం నీదికాదా? "

సుధీర్ వ్యక్తిత్వం మీద అతని రక్తం మీద పేగుతీపి మీద ఆఖరి అస్త్రం ప్రయోగించాడు సుబ్బారెడ్డి.

"మీ కూతురు చేసిన అక్రమాన్ని మీరు గాబట్టి సమర్థిస్తున్నారు రెడ్డిగారూ. రాధకి పుట్టిన పిల్లాడ్ని రేపు ఎవరేం అన్నా ఇవాళ నన్ను అంటున్న దానికి మాత్రం నేను భరించలేకపోతున్నా."



"సుధీర్! నాకు యెదురుతిరిగి అడ్డం తిరిగి నువ్వు ఏదో సాధించాలను కుంటున్నావేమో? నువ్వు ఇంత మొండిగా తయారయ్యావంటే ఇందులో ఖచ్చితంగా ప్రతిపక్షాల చెయ్యివుండి వుంటుందని నాకు ఇప్పుడు బాగా నమ్మకం కలుగుతున్నది."

సుధీర్ సుబ్బారెడ్డి మాటలకి వ్యంగ్యంగా నవ్వాడు. 'చూడండి రెడ్డిగారూ. నేను డిప్లమాటిక్ సర్వీసులో వున్నవాణ్ని. నా దగ్గర మీరు డిప్లమసీ వాడితే ఎలా? మీ కూతురు పెళ్లికి ముందే చెడిపోడానికి అది తెలిసి నేను విడాకులు అడగడానికీ మీరు రాజకీయపు రంగు పులుముతున్నారంటే మనదేశ రాజకీయాలు ఎంత అధ్వాన్న స్థితికి దిగాయో అధికార తాపత్రయం ఎంత హేయంగా పతనం అయిందో అర్థం అవుతున్నది," అని సుధీర్ నీచంగా ఒకసారి చూశాడు.

"బహుశ మీకువున్న అధికారబలం అంగబలం రాజకీయ ప్రాబల్యంతో నా ఉద్యోగ్యం తీయించేస్తారు. అంతకన్నా ఏం చెయ్యలేరు. అందుకు నేను ఇంతకు ముందే సిద్ధపడ్డా. మీ వంటి చాలా పవర్ ఫుల్ అయిన వ్యక్తిని కాదని ఎదిరించడంలోని ఇబ్బందులు నాకు తెలుసు. నేను పెళ్లాడబోతున్న సుసాన్ నాకు అమెరికాలో పౌరసత్వం కల్పించబోతున్నది. వాళ్ళ ఫ్యాక్టరీ నాకు ఇస్తున్నారు. దాన్ని నిర్వహిస్తే మీవంటి వాళ్ళని నెలకి ఇద్దర్ని కొనగలను." సుబ్బారెడ్డి రాక్షసంగా చూశాడు సుధీర్ని. ఆయన కింది దవడ ఆవేశంతో ఒణికి పోతున్నది. బుగ్గలు ఎర్రబడ్డాయి. కతత కెంపువారి పోయింది. మెడకింద చెమట ధారాపాతంగా కారుతున్నది.

"అయితే నా పరువు ప్రతిష్ఠలు బజారు పాలు చెయ్యడమే లక్ష్యంగా పెట్టుకున్నావ్? దీనివలన నీకు వచ్చేదేమిటి? పోనీ ఒక పని చెయ్. రాధను నువ్వు ఏలుకోవద్దు. ఆమె ఈ దేశంలోనే వుంటుంది. నువ్వు అమెరికాలో సెటిల్ అయిపో. నీ ఇష్టం అయినదాన్ని పెళ్లాడు అక్కడ. కానీ ఇక్కడ కోర్టుకి విడాకులు అడగకు. ఆ ఒక్క మేలు చెయ్."

"నావల్ల కాని పని అది. రాధ జీవితంలో ఇలా జరిగిందని పెళ్ళికిముందు కనీసం ఒక్క మాట అయినా చెప్పివుంటే నేను ఎంతో ఆనందిద్దును. కానీ మీరు దాన్ని దాచిపెట్టారు. పైగా ఇంగ్లండులో పదేళ్ళుగా చదువుకొంటున్న నాకు అఫ్టరాల్ ఈ విషయం ఎలా

తెలుస్తుందని అనుకున్నారు. నా అమాయకత్వాన్ని విదేశాలలో వుండటాన్ని ఆధారం చేసుకొని మోసం చెయ్యాలనుకొన్నారు. అదే నేను భరించ లేకపోతున్నా" సుధీర్ కసి అంతా ప్రతిమాటలో పొంగుతుంటే సుబ్బారెడ్డి రెడ్‌హాండెడ్‌గా పట్టుబడ్డ అంతర్జాతీయ నేరస్తుడిలా షేక్ అయిపోతున్నాడు. ఎంత ప్రయత్నించినా అఫెన్స్‌కి డిఫెన్స్‌కి దారి చిక్కడంలేదు.

"నా పెళ్ళికి ముందే మీరు నాకు అమెరికాలోని ఇండియన్ రాయబార కార్యాలయంలో ప్రముఖ ఉద్యోగం రావడానికి యెందుకంత ప్రయత్నించారో ఇప్పుడు అర్థం అవుతున్నది. ఇక్కడ గూడా నాకు చాలా మంచి ఉద్యోగాలు వచ్చాయి. అంతే కాకుండా స్వయంగా నేను ఇండస్ట్రీ ఆరంభించుకొనే తాహతు నాకు ఉన్నప్పటికీ అదీ జరగనివ్వలేదు. పెళ్ళిచేసి వెంటనే నన్ను విదేశాలకి తోలేశారు. మీ అభిమానం వెనక ఇంత లౌక్యంవుందని మీరు నాకోసం చేసిన శ్రమలో ఇంత కుట్ర వుందని నేను వూహించలేక పోయినందుకు బాధపడ్తున్నా."

"ఇందులో దాచింది ఏం లేదు. అప్పుడు చెప్పడానికి వీల్లేకపోయింది. అంతకన్నా మరేం లేదు." నీళ్ళు నముల్తూ సుబ్బారెడ్డి యెలాగో అన్నాడు.

"మిమ్మల్ని అసహ్యించుకోడానికి గూడా నాకు సిగ్గువేస్తున్నది. పెళ్ళికి ముందు ఇరవై రోజులపాటు మీ సిరిసంపదలు హోదా రాబోయే పదవులు ఆస్థి పాస్తులు మీకువున్న బ్లాక్ మనీ స్వరూపం బినా మీ పేర్లమీద మీకున్న పరిశ్రమలు వంటి యెన్నో చెప్ప గలిగారు గానీ ఈ ఒక్క విషయం చెప్పడానికి వీల్లేక పోయిందా! బ్రూటల్ మెజార్టీతో అసంబ్లీలో ప్రతిపక్షాలు అడిగే నిజాల నోరు నొక్కడానికి ప్రజలు అడిగే ప్రశ్నల్ని మీకున్న బలంతో ఖాతరు చెయ్యక పోవడానికి మీరు అలవాటు పడవచ్చు. అసహాయులు అజ్ఞానులు మూర్ఖులు అయిన ప్రజల్ని వంచించి విభజించి భుజించడం అక్కడ సాగవచ్చు. కానీ నాదగ్గర కాదు. పెళ్ళికిముందు మీకు, పెళ్ళికి తర్వాత ఐదేళ్ళు నాతో కాపరం చేసిన రాధకీ గూడా ఈ విషయం నాతో చెప్పడానికి తీరలేదు. అది నన్ను నమ్మ మంటారు. అంతేనా? "

సుధీర్‌ని సుబ్బారెడ్డి తదేకంగా చూశాడు. ఆ క్షణంలో నియంత అయితే అతన్ని గ్యాస్ ఛేంబర్‌లో పడేసి గ్లాసుడోర్స్‌లోంచి చూసి ఆనందించేవాడు. కానీ ఏం చెయ్యలేని నిస్సహాయస్థితి ఏంచెయ్యకుండాగూడా ఉండలేని దుర్భరస్థితి.

ఇప్పటికే ఢిల్లీ, బొంబాయిల్లోని ఇంగ్లిషు పత్రికలు వి.ఐ.పి. స్కాండల్ పేర రకరకాల వ్యాసాలు తనమీద వేశారు. ఈ స్థితిలో సుధీర్ కోర్టులో విడాకులకి దావావేస్తే దేశంలో రకరకాల వదంతులకి మరింత శక్తి వస్తుంది. దేశంలో ప్రముఖ రాజకీయవాది ఒక మంత్రి ఎంతో రాజకీయ చరిత్రగల వ్యక్తి అయిన తను చివరికి ప్రొఫ్యూమా మాదిరిగా రాజకీయాల్నించి శాశ్వతంగా విరమించవలసి వస్తుంది. నేడో రేపో మంత్రివర్గాన్ని సస్పెండ్ చేయించి తిరిగి తను ముఖ్యమంత్రిగా కొత్త మంత్రివర్గంతో ప్రమాణస్వీకారం చేసి దేశాన్ని ఏలాలి అనుకుంటున్న సమయంలో సుధీర్ తన కూతురుని తనని రచ్చకి ఈడిస్తే ఏం అవాలి? ఈ నాడు తను ఉన్నస్థితిని ముప్ఫై సంవత్సరాలు కష్టపడి సాధించింది. అదంతా తన కళ్ళముందు ఇసుక కుప్పలా కూలిపోతుంటే సుబ్బారెడ్డికి స్పృహ తప్పిపోతున్నట్లు అనిపించింది.

ర ర ర

ఇంకా సరిగ్గా తెల్లారలేదు. అప్పుడే వీధి తలుపు చప్పుడుఅయితే వెళ్ళి బద్ధకంగా తలుపు తీశాను. ఎదురుగా నాధ్! నా కళ్ళముందు కనిపిస్తున్నది నిజమా అబద్ధమా అని సందిగ్ధంలో ఉండగానే వాడు నన్ను కావలించుకొన్నంత పనిచేశాడు.

చాలాకాలం తర్వాత వచ్చిన స్నేహితుడి రాకతో ఇల్లంతా సందడిగా వుంది. ఆఫీసుకి శలవుపెట్టేసి ఇంట్లో కూర్చున్నా. అందులో



రాత్రి సరిగ్గా నిద్రగూడా లేదు. నాలుగు రోజుల్నించి మంచి కథ రాయాలని ఎంతగా ప్రయత్నిస్తున్నా ఫలించడంలేదు. అవతల పండగ స్పెషల్ ఇష్యూకి కథపంపమని పత్రిక ఆఫీసు నుంచి వచ్చిన ఆరోతాఖీదుకి సిగ్గుపడి రాత్రి తెల్లార్లూ కథ రాయాలని నేను చేసిన యత్నం, పూర్తిగా వ్యర్థం అయిపోయింది.

"కళ్ళేమిటి అలా యెర్రగా వున్నాయ్ " నాథ్ గమ్మత్తుగా అడిగాడు ఖరీదయిన సిల్కు లుంగీని సర్దుకొంటూ. నా అవస్థ అంతా చెప్పి 'రోజుకి నాలుగు ఊళ్లు తిరిగేవాడివి. మంచి కథ చెప్పరాదూ, రాసుకొంటాను' అన్నా.

నాథ్ చాలా కష్టపడి పైకి వచ్చినవాడు. స్కూలు ఫైనల్ దాకా కలిసి చదివాం. ఆ తర్వాత సంబంధాలు తెగిపోయాయి. ఢిల్లీలో యిప్పుడు రెడీమేడ్ దుస్తుల ఎక్స్‌పోర్ట్ వ్యాపారం భారీగా సాగిస్తూ చాలా పెద్దవాడు అయిపోయాడు.

నా రచనలుమాత్రం తరచు పత్రికల్లో చదువుతాడుట. అందుకని వాడు నన్ను మర్చిపోలేదు. ముందుగా ఏదో పత్రిక ఆఫీసులో నా యెడ్రస్ సంపాదించి తిన్నగా నా ఇంటికి ఇలా వచ్చేశాడు. వాడ్ని ఈ రోజు ఈ స్థితిలో చూస్తుంటే ఆనందంతోపాటు మా పెద్దవాడికి ఏదన్నా చిన్న ఉద్యోగంగూడా ఇప్పిస్తాడని ఆశ కలుగుతున్నది. సాయింత్రం దాకా కబుర్లతో కాలక్షేపం అయిపోయింది. చీకటి పడ్తుంటే మళ్ళీ కథ సంగతి గుర్తువచ్చి భయంవేసింది. తెల్లారి యెలాగయినా పోస్టు చెయ్యాలి. కానీ ఎలా? మంచి ప్లాట్ దొరకడం లేదు. ఏం చెయ్యడం?—

"కథ చెప్పరా బాబూ " బతిమలాడాను వాడ్ని.

"కథలు చెప్పడం రాదు నాకు."

"పోనీ ఎదన్నా మంచి అనుభవం చెప్పు."

"ఆల్‌రైట్ చెప్తున్నా విను," అని నాథ్ దేశంలో విపరీతంగా వినబడ్తున్న సుబ్బారెడ్డి కూతురు రాధ కథ మొత్తం చెప్పాడు. ప్రస్తుతం సుధీర్ విడాకుల కేసు కోర్టులో విచారణ జరుగుతున్నది. ఏ పేపరు తీసినా ఎవరినోట విన్నా రాధకేసే. ఇదే సందు అనుకొని మెల్లిగా కొందరు సుబ్బారెడ్డి గతంలో చేసిన ఇంకొన్ని కుంభకోణాల్ని బయటికి

లాగుతున్నారు. వీటన్నిటి మధ్య సుబ్బారెడ్డి రాజకీయ జీవితం ఇటు మంత్రివర్గం ఏం అవు తుందోనని అంతా అనుకుంటున్నారు.

"ఎక్కడో ఢిల్లీలోవున్న నీకు ఈ వ్యవ హారం యింత వివరంగా యెలా తెలుసు?" అన్నా ఆసక్తిగా. నాథ్ నవ్వి త్రిబుల్‌ఫైవ్ సిగరెట్‌ని మహా నిర్లక్ష్యంగా వెలిగిస్తూ "అందులో రఘుని నేనే! ఈ కేసులో తెల్లారి కోర్టులో రాధని పెళ్ళికిముందు అక్రమంగా అనుభవించిన వ్యక్తిగా సాక్ష్యం ఇస్తున్నది ఎవరోకాదు నేనే' అన్నాడు గర్వంగా నవ్వి.

ఒక్కసారిగా నా తల తిరిగిపోయింది. ఎదురుగావున్న నాథ్‌లో ఇంత నీచం అయిన రాక్షసుడు దాగివున్నాడా అని నివ్వెర పోయాను. సహజంగా ప్రతి చిన్నదానికీ మూవ్ అయిపోయే నేను నాథ్ చెప్పింది విన గానే షాక్ తిన్నాను.

ఒక అమాయకురాల్ని పెళ్ళికి ముందు వంచించి అక్రమంగా అనుభవించడం కాకుండా, తను ఆ పని చేసినట్లు కోర్టులో సాక్ష్యం యివ్వ డానికి నాథ్ వచ్చాడంటే వాడు ఎంత సిగ్గు విడిచేశాడో! సిగ్గు విడిచేసి ఆర్థికంగా ఎదిగే శాడు. ఛీ! ఛీ! ఒక ఆడపిల్లని అనుభవించడం కాకుండా దాన్ని ఆసరాగా ఆమె జీవితం మొత్తం కూలదీస్తాడా నాథ్? నా ఆలోచన్లు పరిపరి విధాల పోతున్నాయి.

"నాథ్! ఒక సంస్కారం గల మనిషిగా నువ్వు చెయ్యాల్సిన పనికాదు ఇది. దయచేసి ఈ సాక్ష్యం చెప్పకు" అన్నా దీనంగా. నిజంగా అ రాధ ఎవరో నాకు తెలీదు. కానీ నాకు అదేదో నా కూతురికే జరుగుతున్నట్లు లోపల అంతా బాధ.

"లేదు? నేను సాక్ష్యంచెప్పి తీర్తాను. ఈ సృష్టిలో ఏ శక్తీ నన్ను ఆపలేదు." అన్నాడు నాథ్ ఖండితంగా. అతని గొంతులో ఎంతో బలం అయిన నిర్ణయం కనిపించింది.

"పాపం! ఆపిల్ల నిన్ను ఏం చేసింది? అమా యకంగా నిన్ను నమ్మినందుకే గదా యింత పాపం చేస్తున్నావ్? నా మాట విను. నీకు ఏం తక్కువ అయిందని, ఇంకా ఏం సంపా దించాలని యిదంతా? ఒక కాపరం నిలబెట్టాలి గానీ కూలదొయ్యకూడదు. ఇదే నీ చెల్లెలికో భార్యకో జరిగితే నీకు ఎలా వుంటుందో ఒక్కసారి ఆలోచించు"నాథ్‌నిఎలా మార్చాలో తెలీక పదాలు వెతుక్కోవలసి వస్తున్నది.

ఆ మాటకి నాథ్ నన్ను ఒక వెధవగా జమ కడ్తున్నట్లు చిత్రంగా నవ్వాడు. "రాధ అనే అందమైన అమాయకం అయిన అగర్భ శ్రీ మంతురాలికి అన్యాయం జరిగి పోతున్నదని భరించలేక నీ హృదయం తల్లడిల్లి పోతున్న దని నాకు తెలుసు మిస్టర్ రచయితా! కానీ ఇప్పుడు నువ్వు ఒకమాట అన్నావ్ ఏమిటి? ఇదే నా చెల్లికో మరెవరికో జరిగితే నేను ఇలాగే ప్రవర్తిస్తానా అన్నావ్.

కానీ నాకు నా కుటుంబానికీ యింతకన్నా భయంకరం అయిన ఘోరం జరిగిపోయి నప్పుడు నువ్వు నీ లోకం నీ సంఘం ఈ నీతులు ఆదర్శాలు మానవత్వాలూ ఏవీ నాపట్ల నా కుటుంబంపట్ల ఆమాట అనుకోలేదు రవీ! ముప్పై ఏళ్ళనాడు నా తండ్రిని ఈ సుబ్బారెడ్డి పబ్లిక్‌గా హత్యచేయించి కేసు తనమీదకి ఏ మాత్రం పడకుండా జాగ్రత్త పడ్డ నాడు జరిగిన దాన్ని కళ్ళారా చూసిన వేలాది మందిలో ఒక్కడు కనీసం ఒక్కడయినా ఆ ఘోరం తన తండ్రికి జరిగింది తన కుటుంబానికి జరిగిం దని అనుకోలేదు. అలాంటప్పుడు నేను ఇప్పుడు ఎలా అనుకుంటా. ఎందుకు అను కుంటా. అదంతా విధి తలరాత నాన్సెన్స్ అను కుని మర్చిపోయే వెధవని కాను రవీ నేను.

—రవీ! ఈ రోజు ఆ రాధ కోసం యింత తపించిపోతున్న హృదయం ఆనాడు మనం చదువుకునే రోజుల్లో ఏనాడూ నా పరిస్థితులు నా సమస్యలకి ద్రవించలేదు. నీ కళ్ళముందు నేను అన్నం లేకుండా కట్టుకో బట్టలేకుండా మాడి చస్తున్నా అయ్యో అనుకోలేదు. నువ్వే కాదు ఎవరూ అనుకోలేదు.

మా నాన్నగారు స్వతహా మంచి తెలివి తేటలు నిర్వహణ దక్షత రాజకీయ విజ్ఞానం



వున్నవాడు. అప్పటిదాకా మా ఊళ్ళో ఈ సుబ్బారెడ్డి ధ్వజానికి తిరుగులేదు. కానీ మా నాన్న వీడి అక్రమాల పతాకలకి నిప్పు అంటించడానికి ఏనాడు నడుం కట్టుకున్నాడో ఆనాడే ఆయన్ని భూమి మీద నుంచి తొలిగించెయ్యాలని సుబ్బారెడ్డి పథకం అల్లాడు. ఫలితంగా యెదిగీ యెదగని ఆరుగురు పిల్లలు వాళ్ళ తల్లి అనాథలై రోడ్డున పడ్డారు. పట్టపగలు ఇంటిమీదకి బరిసెలు తీసుకొచ్చి మా నాన్నని వీధిలోకి లాగి నరికిపారేస్తే ఒక్క రాస్కెల్ ఆదేం అనలేదు. ఒక్కడు కోర్టుకి వచ్చి సాక్ష్యం చెప్పలేదు.

—ఆ తర్వాత ఆ కుటుంబం ఏంఅయింది యెలా బతికింది? అందులో యెందరు ఆకల్తో చచ్చారు? ఎందరు రోగాల్తో సృష్టిలో ఆనందం కోల్పోయారు?—ఎవరూ ఆలోచించ లేదు.

నువ్వు దేశంలో ప్రముఖ రచయితవి! సాహిత్యంలో సంస్కారం మానవతలాంటివి మనిషిలో పెంపొందించడానికి కలం పట్టానను కునే హిపోక్రిట్స్‌లో నువ్వొకడివి కానీ నీ కలానికి యెప్పుడన్నా నే చెప్పిన నేను అనుభవించిన జీవితం తగిలిందా? లేదు. అంతేకాదు మూడేళ్ళ పసిపిల్లాడు చలిజ్వరంతో కళ్ళ ముందు మందులేక చనిపోవడం అనుభవంలో నీకు తెలుసా రవీ?

ఏ దిక్కూ లేక అనాథ శరణాలయంలో ఒక పన్నెండేళ్ళ పసిపిల్ల చేరితే ఆ అమ్మాయి చెరచబడి చచ్చిపోతే, దాన్ని సహజం అయిన మరణంగా ఆ శరణాలయం ధృవపరచడం జరిగితే యెలా వుంటుందో తెలుసా? నాచెల్లెలికి జరిగింది గాబట్టి నాకు తెలుసు!

నీ ఊహ తెలిసిన వయస్సులో నీ కుటుంబాన్ని బతికించడం కోసం నీ తల్లి వ్యభిచరించి తన మీద ఆధారపడ్డ వాళ్ళని బతికించడం అంటే ఏమిటో అది అనుభవంలో యెలా వుంటుందో క్షణంసేపు ఊహించగలవా రవీ?

వాస్తవంలో అనుభవించడం వేరు, ఆదర్శాలు ప్రబోధించడం వేరు. వాస్తవంలో నువ్వే నా పాత్ర అయితే నేను చేసినదానికన్నా ఇంకా నిజంగా ప్రతీకారం తీర్చుకునేవాడివి. సుబ్బారెడ్డి కూతుళ్ళు మొత్తాన్ని అనుభవించి కంపెనీలకి అమ్మేసేవాడివి. కానీ నా కథని రచయితగా నువ్వు ఏంచేస్తావో తెలుసా? సుధీర్‌ని ఏడిపించడానికి రఘు అలా ఉత్తరాలు సృష్టించాడనో లేదా సుధీర్ వదిలేసిన రాధని రఘు మళ్ళీ పెళ్ళిచేసుకుని తన తప్పు తెలుసుకున్నా

దనో రాస్తావ్. అలా రాసి ప్రజల్ని మోసం చేస్తూ బతుకుతావ్ కాబట్టి నీకన్నా నేనే గొప్ప వాడ్ని, ఉత్తముడ్ని.

కానీ రవీ' రచయిత నియంత కాదు. ప్రవక్త కాడు.

నియంత అయి కలం బలంతో శాసించ గూడదు.

ప్రవక్త అయి నీతులు ధర్మ శాస్త్రాలు బోధించగూడదు.

రచయితలు ఎప్పుడూ వాస్తవాల్ని నిజాల్ని చెప్పాలి. తద్వారా నిర్ణయం పాఠకుల్ని తీసుకో నివ్వాలి.

ఇప్పుడు నువ్వేగానీ నా కథ రాస్తే చదివే పాఠకుల్లో రఘు ఉండవచ్చు సుబ్బారెడ్డి వుండ వచ్చు. ఇంకా చనిపోయిన మా నాన్న వుండ వచ్చు. మా అమ్మ ఉండవచ్చు. రాధ గూడా ఉండవచ్చు. కానీ వాళ్ళలో రఘుల్ని అన్యాయం చేసి అపమార్గం పట్టించే హక్కు నీకులేదు. పదేళ్ళుగా నీ రచనలు చదివి చదివిన తర్వాత సమాజంలో నువ్వు ఎంతమందిని అప మార్గంలో పడేశావోనని భయంవేసి నిన్ను కలవాలని వచ్చా.

అందుకే నా కథ చెప్పా. నేను భయపడ్డట్లు గానే తప్పు నాది అన్నావ్. కానీ అది ఎప్పటికీ కాదు. ఎందుకంటే సుబ్బారెడ్డి దురాగతాలకి నా కుటుంబం బలి అవడం ఏంత న్యాయమో నేను చేస్తున్నదీ అంతే న్యాయం. అతని అన్యా యాన్ని ఆపలేని సంఘానికి ఈ అన్యాయం మీద గొంతుచించుకునే హక్కులేదు. నువ్వు బాధపడ్తున్న రాధకి అలాంటి వాళ్ళకి అదే చెప్పు"

బయట చాలా చీకటిపడిపోయింది. వరండా బయట కూర్చున్న మాకు టైం ఎంతఅయిందో తెలీడంలేదు. ఎదురుగా వున్న నాథ్ కూడా కని పించడంలేదు. కేవలం అతని గొంతు విని పిస్తున్నది.

"ఇంతకీ నా కథ రాస్తావా?" అన్నాడు నాథ్ మళ్ళీ.

"నావల్ల కాదు నాథ్. నన్ను క్షమించు."

నాథ్ ఫక్కుని నవ్వాడు. "ఆ సంగతి నాకు ఎప్పుడో తెలుసు. పోనీ నిజంగా నీకథ ఏదన్నా వుంటే చెప్పు. నువ్వు నిజంగా రాసిన కథ ఒక్కటి ఉందా?"

"అంటే నేను రాసినవి యేవీ కథలు కావంటావా?"

"ఆ నిజం నీకే తెలుసు. పద భోజనానికి. అప్పుడే పన్నెండు అయింది" అని నాథ్ లేచాడు.

నిజంగానే రాణాలో గంటలు వినిపించాయి.

□

ఒకాయన హడావుడిగా ఆర్. టి. సి. సమాచారం ఆఫీసుకి వెళ్ళి ''విజయవాడ బస్ ఎన్ని గంటలకండీ'' అనడిగాడు. ''తొమ్మిది గంటలకి'' జవాబు వచ్చింది. నిమిషం తర్వాత మళ్ళా వచ్చి ''కాకినాడ బస్ ఎన్నింటికీ?'' అనడిగాడు. ''ఎనిమిదింటికి'' అన్నారు సమాచారం వాళ్లు. వెళ్ళి మళ్లా వచ్చాడు ''బందరు బస్సు ?'' జవాబు చెప్పారు. నిమిషం తర్వాత మళ్ళా ''గూడానికి....'' అన్నాడు. జవాబు చెప్పారు. మళ్ళా మళ్ళా వచ్చి ఎక్కడ కెక్కడికో అడుగుతున్నాడు. సమాచారం వాళ్ళకి ఓర్పు నశించింది. ''అసలింతకీ తమరు ఎక్కడికి వెళ్ళాలి ?'' అనడిగారు.

''అబ్బే. . టైంటేబులు పట్టీ రాసుకుంటున్నాను'' అన్నాడాయనతో తాపీగా.